క్లుప్తంగా

ముచ్చట్లలో ప్రత్యేక పూజలు



ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న శైవ పుణ్యక్షేత్రం ముచ్చట్లలో శ్రావణ సోమవారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామిలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అలాగే బుగ్గానిపల్లె గ్రామ సమీపంలోని బ్రహ్మ సూత్ర సహిత నాగలింగేశ్వరస్వామి ఆలయంలోనూ ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ స్వరూప

బనగానపల్లె రూరల్: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారిణి స్వరూప సూచించారు. సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ రోజారాణి ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ యుక్త వయసులో బాలికలు ఆకర్షణ, ప్రలోభాలకు గురికాకుండా చదువుపై ధ్యాస ఉంచాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. చిన్నవయసులోనే వివాహం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ సునీత తదితరులు ఉన్నారు.

పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో మహాత్మాజ్యోతిరావుపూలే, సావిత్రీ బాయిపూలే విగ్రహాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరీ, బీసీ సంక్షేమం సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి సంఘ సంస్కర్తలు, జాతీయ నాయకులు, విద్యావంతులు, మేధావుల కృషి గొప్పదన్నారు. వారిని స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. చదువుల తల్లి సావిత్రీబాయిపూలే జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సోమశేఖర్, ప్రిన్సిపాల్ గంగుల నాగరాజు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా ఐక్యవేదిక మండల అధ్యక్షురాలు కొమ్ము పెద్దక్క పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కోనేటిలో గంబూసియా చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

కోవెలకుంట్ల: దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్లు రాబర్ట్‌కెన్నెడి, అశోక్ సూచించారు. దోమ లార్వాను నిర్మూలించడంలో భాగంగా సోమవారం పట్టణంలోని కోనేరు, బావుల్లో గంబూసియా చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో దోమలు వ్యాప్తి చెంది మలేరియా, చికున్‌గున్యా, డెంగీ తదితర విషజ్వరాలు ప్రబలే ప్రమాదముందన్నారు. వచ్చే దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: మండలంలోని జగదుర్తి గ్రామ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ఉడుములపాడు, జగదుర్తి, సోంపురం, గుంటుపల్లె, అమకదాడు గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపేస్తామన్నారు. వ్యవసాయనికిచ్చే కరెంట్ ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

డ్రమ్ సీడర్‌తో అధిక లాభాలు

- పెట్టుబడి ఖర్చులూ తక్కువే
- మొగ్గుచూపుతున్న రైతులు



తక్కువ నీటిలో డ్రమ్ సీడర్ ద్వారా వరి పంట సాగు చేస్తున్న రైతు



మొలకెత్తిన వరి విత్తనాలు

బనగానపల్లె: వర్షాభావ పరిస్థితుల్లో వరి సాగుకు డ్రమ్ సీడర్ ఎంతో ఉపయోగం. తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు ఉపకరిస్తుందని వ్యవసాయశాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఆయా ప్రాంతానికి అనువైన భూముల్లో ఈ పద్ధతిలో సాగు చేయవచ్చు. ఎకరానికి 8–12 కిలోల విత్తనం అవసరం అవుతుంది. వరి విత్తనాలను 24 గంటలు నానబెట్టి, నానిన విత్తనాలను గోనె సంచిలో గానీ, గోనే సంచి కప్పిగానీ ఉంచాలి. 24 గంటల తరువాత విత్తనాల ముక్కుపగిలి తెల్లగా మోసు వస్తుంది. మొలక పొడుగా వస్తే డ్రమ్ సీడర్ నుంచి విత్తనాలు రాలవు. అందువల్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. డ్రమ్‌సీడర్‌కు ఉన్న నాలుగు ప్లాస్టిక్ డ్రమ్‌ల్లో మొలకెత్తిన విత్తనాలను సగానికి పైగా నింపాలి, తక్కువ నీరున్న భూమిలో డ్రమ్ సీడర్‌ను లాగితే ఎనిమిది వరుసల్లో వరుస, వరుసకు మధ్య 20 సెం.మీ దూరంలో గింజలు పడుతాయి. వరుసలో కుదురు కుదురుకు మధ్య 5–8 సెం.మీ ఉంటాయి. ఒక ఎకరం విత్తడానికి రెండు గంటల సమయం పట్టగా ఒక రోజులో ఈ పద్ధతి ద్వారా మూడు ఎకరాలు విత్తుకోవచ్చు.

ఎరువులు..

ఈ పద్ధతి ద్వారా సాగు చేసిన వరి పంటకు వ్యవసాయాధికారులు సిఫారసు చేసిన ఎరువులను మోతాదులో వాడాలి. కానీ దమ్ములో నత్రజని ఎరువులు వేయకుండా కేవలం భాస్వరం ఎరువులు, పొటాష్ ఎరువులు మాత్రమే వేయాలి. నత్రజని వినియోగం వల్ల కలుపు ఎక్కువగా వస్తుంది.

కలుపు..

నేరుగా గింజలను విత్తడం వల్ల కలుపు మొక్కలు వరి గింజలతో పాటు మొలకెత్తుతాయి. అందువల్ల ఈ పద్ధతిలో కలుపు మందులు కచ్చింగా వాడాలి. డ్రమ్‌సీడర్ లాగిన తరువాత మూడు నుంచి నాలుగు రోజుల్లో 80 గ్రామ్‌ల ఇథైల్ కలుపు మందును పిచికారీ చేయాలి. లేదా ఆక్సాడయార్జిల్ 35 గ్రామ్‌లను అరలీటర్ నీటిలో కలిపి 20 కిలోల ఇసుకలో కలిపి పొలానికి పలుచగా నీరు పెట్టి చల్లుకోవాలి. విత్తనాలు వేసిన 20–25 రోజులకు వెడల్పు ఆకులు సన్న ఆకు కలుపు ఉంటే ఎకరాకు 100–120 మీ.లీ బిస్‌పైరీబాక్ సోడియం కలుపు మందును పిచికారి చేయాలి. విత్తిన 20–25 రోజులకు కోనోవీడర్‌ను తడపాలి. ఈ పద్ధతి వల్ల మొలకెత్తిన కలుపు భూమిలోకి కలియబెడుతుంది. విత్తనం వేసినప్పటి నుంచి పొట్టదశ వరకు పొలంలో నీరు నిల్వ ఉండకుండా కేలం బురదగా ఉంటే సరిపోతుంది. ఎక్కువైన నీరు బయటకు వెళ్లడానికి కాల్వలు ఏర్పాటు చేయాలి.

తెగుళ్ల యాజమాన్యం

సాధారణంగా వరిసాగుతో పోల్చుకుంటే డ్రమ్ సీడర్ పద్ధతిలో పురుగులు, తెగుళ్ల తాకిడి తక్కువగా ఉంటుంది. మొక్కలకు గాలి, వెలుతురు బాగా ప్రసరించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. చీడపీడల నివారణకు సాధారణ వరిసాగు మాదిరిగానే సస్యరక్షణ చర్యలు చేట్టాలి. డ్రమ్‌సీడర్ ద్వారా సాగు చేసిన పంట పది రోజుల ముందుగానే కొతకు వస్తుంది.

పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువ



సాగునీటి సౌకర్యం తక్కువగా ఉన్న సమయంలో డ్రమ్‌సీడర్ వరిసాగు రైతుకు లాభదాయకంగా ఉంటుంది. ఈ పద్ధతి ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక పంట దిగుబడి లభిస్తుంది. చీడ పీడలు కూడ తక్కువగా ఉంటాయి. పది రోజుల ముందు కోతకు వస్తుంది. ఈ పద్ధతి ద్వారా సాగుకు రైతులు ఆసక్తి చూపాలి.

– సుధాకర్, వ్యవసాయ శాస్త్రవేత్త, కేవీకే యాగంటిపల్లె, బనగానపల్లె మండలం

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్థానిక పంచాయతీ మాజీ సర్పంచ్ శేగు అరుణ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2.80 లక్షలు మంజూరైంది. సోమవారం చెక్కును మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, కోఆప్షన్ సభ్యులు పాతపేట రఫి..బాధిత కుటుంబానికి అందజేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సీపీఎం సమరభేరి వాల్‌పోస్టర్లను ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 1న గ్రామ సచివాలయాలు, 4న మండల కార్యాలయాల వద్ద ధర్నా చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



న్యాయవాదులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి తంగమణి

డోన్ టౌన్: సెప్టెంబరు 9న నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. స్థానిక సబ్ కోర్టులో సోమవారం డోన్ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ అవ్వడానికి అవకాశమున్న కేసుల కక్షిదారులతో మాట్లాడి లోక్ అదాలత్‌కు తీసుకురావాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు శ్రీధర్, శేష శయనరావు, మధుసూదన్, మద్దయ్య, రంగారెడ్డి, అంజనయ్యగౌడ్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో సోమవారం సాయంత్రం బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసు కమిటీ సభ్యులు, న్యాయవాది నరసింహులు పాల్గొన్నారు.

యాగంటీశ్వరులకు పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతులకు సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

రుష్యశృంగ మహర్షి విగ్రహానికి జలాభిషేకం



రుష్యశృంగ మహాముని విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదు గ్రామంలో రుష్యశృంగ మహర్షి విగ్రహానికి జలాభిషేకం చేశారు. కొద్ది రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో గ్రామస్తులు స్థానిక శివాయలంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని రుష్యశృంగ మహర్షి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం మహర్షి విగ్రహానికి 101 బిందెల బావినీటితో అభిషేకం చేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు ఇలా చేస్తే వర్షాలు కురుస్తాయని తమ నమ్మకమని గ్రామస్తులు తెలిపారు.

రాజగోపురం శంకుస్థాపన ప్రతిష్ట

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరు



పూజలు నిర్వహిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దంపతులు

అవుకు: మండల పరిధిలోని మంగపేట గ్రామ సమీపంలో కాశిరెడ్డి నాయన ఆశ్రమ ఆవరణంలో నిర్మిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ రాజగోపురం శంకుస్థాపన సోమవారం అట్టహాసంగా జరిగింది. రెండు రోజులుగా జరిగిన ప్రతిష్ట పూజ, యాగ కార్యక్రమాల్లో పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమ నిర్వాహకుడు, కాశిరెడ్డి నాయన ప్రియ శిష్యుడు అవధూత గణపతి నాయన ఎంతో ప్రతిష్టాత్మకంగా రూ.8 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టారన్నారు. ఆలయ నిర్మాణం అద్భుత శిల్పకళా నైపుణ్యంతో, ప్రాచీన కాలంలో రాజులు నిర్మించిన ఆలయాల తరహాలో కేవలం రాతికట్టడంతో ఆలయ నిర్మాణం జరగటం ఎంతో విశేషమని తెలిపారు. ఇలాంటి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.5 కోట్ల నిధులు కేటాయించటం జరిగిందని తెలిపారు. రాబోయే కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానం రీతిలో ఎంతగానో ప్రసిద్ధి చెందుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు.

సరసమైన ధరలకే నాణ్యమైన భోజనం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: ఆహా క్యాంటీన్ల ద్వారా పొదుపు మహిళలు సరసమైన ధరలకే నాణ్యమైన భోజనం అందించడం అభినందనీయమని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పాతబస్టాండ్‌లో మహిళ స్వయం ఉపాధి గ్రూపు సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, మెప్మా అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పొదుపు మహిళల జీవనోపాధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. మిగతా సభ్యులు కూడా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, ఆర్ట్ రమణ, ధారా హరినాథ్‌రెడ్డి,సుంకన్న, సుంకయ్య, వెంకట్రాముడు,కోఆప్షన్ సభ్యులు రఫి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రమేష్‌బాబు

బనగానపల్లె రూరల్/కోవెలకుంట్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రమేష్‌బాబు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా సోమవారం బనగానపల్లె, కోవెలకుంట్లలో నిర్వహించారు. రాయలసీమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, సంజీవులు, భాస్కర్, ప్రభాకర్, శివబాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై బెదిరింపు కేసు నమోదు

అవుకు: మండల పరిధిలోని గుండ్లశింగవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై సోమవారం బెదిరింపు కేసు నమోదైంది. ఏఎస్ఐ సుబ్రమణ్యం తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కాటసాని హుస్సేన్ రెడ్డి తన ట్రాక్టర్ టిల్లర్లను అదే గ్రామానికి చెందిన కాటసాని జయరాం రెడ్డికి విక్రయించాడు. అయితే కొద్ది రోజులు టిల్లర్లను వాడుకొని తనకు వద్దంటూ తిరిగి వెనక్కి ఇవ్వడంతో హుస్సేన్ రెడ్డి మందలించాడు. ఈ విషయాన్ని మనసుల్లో పెట్టుకున్న జయరాం రెడ్డి.. తాను పొలం నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా ట్రాక్టర్‌తో ఢీకొట్టాడని, అంతటితో ఆగకుండా చంపుతానంటూ బెదిరించాడని హుస్సేన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

దుకాణాల్లో చోరీకి యత్నం

ప్యాపిలి: మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున కొందరు దుండగులు చోరీకి యత్నించారు. ఓ మొబైల్ రిపేరీ షాపులో మూడు పాత మొబైళ్లను తస్కరించారు. అలాగే ఫర్టిలైజర్, మెడికల్ షాపులలో తాళాలు పగులగొట్టేందుకు యత్నించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఇద్దరు మహిళల అరెస్ట్

డోన్ టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి, జలదుర్గం ఎస్ఐ విజయ్‌కుమార్ బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తుండగా చిగురుమానుపేటకు చెందిన ఎరుకల కావడి తులసి, ఎరుకల గాండీ నాగమణి గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 200 గ్రాముల చొప్పున మొత్తం 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి మహిళలిద్దరినీ కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

ప్యాపిలి: సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నాగరాజును నంద్యాలకు, బనగానపల్లెలో పని చేస్తున్న శ్రీనివాసరావును ప్యాపిలికి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 4 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌పై అవగాహన లేని విద్యార్థులు తమ కళాశాలలో సంప్రదించి ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

కరువు నియోజకవర్గంగా ప్రకటించాలి

డోన్ టౌన్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో డోన్‌ను కరువు నియోజకవర్గంగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 20 వేల హెక్టార్లలో కంది, ఆముదం, వేరుశనగ పంటలు సాగు చేశారన్నారు. వర్షాలు పడక పోవడంతో ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. సమావేశంలో నాయకులు జనార్దన్, శేఖర్, గోపినాథ్‌రావు తదితరులు ఉన్నారు.

అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు

- రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడే వాహనాల నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



రోడ్డుపై పార్కింగ్ చేసిన బైక్‌లు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల ప్రధాన రహదారిపై బైక్‌లు, ఆటోలు, కార్లు ఎక్కడ పడితే ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. గతంలో రోడ్డు ఇరుకుగా మారి తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండటంతో రెండేళ్ల క్రితం స్టేట్ బ్యాంక్ సమీపం నుంచి తేరుమిద్దె సమీపం వరకు 14 మీటర్ల వెడల్పుతో విశాలంగా సీసీ రోడ్డు నిర్మించారు. అయినా కొందరు వాహనదారుల తీరు మారలేదు. ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా వాహనాలు నిలపడంతో రాక పోకలు సాగించే వాహన చోదకులకు ఇబ్బంది కలుగుతోంది. చాలా మంది రోడ్డుపై బైక్‌లు ఆపి టీ కొట్ల వద్ద పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు ఏకంగా రోడ్డునే వ్యాపార సముదాయాలుగా మార్చుకున్నారు. తోపుడు బండ్లు రోడ్డుపై ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. నడిరోడ్డుపై పదుల సంఖ్యలో బైక్‌లు అడ్డగోలుగా ఆపినా పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎప్పుడో ఒక సారి వచ్చి సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి జరిమానా విధించి తమ పని అయిపోయిందన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఇద్దరు సిబ్బంది విధుల్లో ఉంటూ ట్రాఫిక్ సమస్య లేకుండా పర్యవేక్షిస్తుండేవాళ్లు. రోడ్డుపై వాహనాలు ఆపకుండా చర్యలు చేపట్టాలని స్థానికులతో పాటు వాహన చోదకులు కోరుతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ



ప్రయాణికుడికి పర్స్ అందజేస్తున్న డీఎం

డోన్ టౌన్: బస్సులో మరచిపోయిన మనీ పర్సును ప్రయాణికుడికి చేరవేసి నిజాయతీని చాటుకున్నాడు డోన్ డిపో ఆర్టీసీ డ్రైవర్ డీఆర్ ప్రసాద్. ఈనెల 23న కర్నూలులో ఓ ప్రయాణికుడు దిగి పోగా సీట్‌లో మనీ పర్సును గుర్తించిన డ్రైవరు ప్రసాద్ డోన్ డిపో అధికారులకు అప్పచెప్పాడు. పర్సు తెరచి చూడగా రూ.9,250, ఆధార్, పాన్, ఏటీఎం కార్డులు, లైసెన్సు, ఆర్సీ ఉండగా వాటి ఆధారంగా అతను కర్నూలుకు చెదిన వెంకటరమణగా గుర్తించి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. అతడు సోమవారం డోన్‌కు రాగా డిపో మేనేజర్ శశిభూషణ్ పర్సును అందజేశారు. డ్రైవరును బాధితుడితోపాటు డిపో మేనేజర్, సిబ్బంది అభినందించారు.

సీసీ రోడ్డు పనుల తనిఖీ



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ

కోవెలకుంట్ల: స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి జమ్మలమడుగు చౌరస్తా వరకు రూ.4 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 400 మీటర్ల మేర డివైడర్‌తో కూడిన సీసీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. డీఈ వెంట ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ గోపినాథ్ ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని మునిమడుగు – రాచర్ల రోడ్డు పనులకు సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ నాయుడు, దివాకర్ రెడ్డి, గోపాల్ తదితరులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిమడుగు నుంచి రాచర్లకు సరైన రోడ్డు మార్గం లేక ఇరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. విషయం తెలుసుకున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రూ.4.5 కోట్లు మంజూరు చేయడంతో పనులు చేపట్టినట్లు తెలిపారు.

బషీర్‌బాగ్ అమరులకు నివాళి



అమరుల చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బేతంచెర్ల: విద్యుత్ చార్జీలకు నిరసనగా నినదించి 2000 ఆగస్టు 28 అప్పటి టీడీపీ ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన బాలస్వామి, విష్ణువర్దన్, రామకృష్ణల చిత్ర పటానికి సోమవారం సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లయ్య, పట్టణ కార్యదర్శి సంజీవ నాయుడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మధు శేఖర్, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు, బాలకృష్ణ, సోమనాయుడు, రాజబాబు, వెంకటరమణ, నాగరాజు, కలాం పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం బషీర్ బాగ్ అమరవీరుల చిత్రపటాలకు సీపీఎం నాయకులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరాం తదితరులు నివాళులర్పించారు.

శరవేగంగా భవన నిర్మాణాలు



కొనసాగుతున్న ఐటీఐ కళాశాల నిర్మాణ పనులు

బేతంచెర్ల: మండలంలో పలు ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. గోరుమానుకొండ సమీపంలో కర్నూలు ప్రధాన రహదారిలో బీసీ బాలుర రెసిడెన్షియల్, జూనియర్ కళాశాలకు రూ.36 కోట్ల నిధులు, ఐటీఐ కళాశాలకు రూ.7,80 కోట్లు, ఎంఎస్ఎమ్ఈ (టూల్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్) కు రూ.4 కోట్ల నిధులతో భవన నిర్మాణాలు రూపుదిద్దుకుంటున్నాయి.